
ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

వర్ధమాన నటి
కె.విజయతో ఇంటర్వ్యూ
చలనచిత్ర నవంబర్ – డిసెంబర్ 1974



నూరు నాటకాల అనుభవంతో చలనచిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి నటిగా ఇప్పుడిప్పుడే పేరు సంపాదించుకుంటున్న కె.విజయ స్వగ్రామం తెనాలి. నందినీ ఫిలిమ్స్ వారి 'ఇల్లు – ఇల్లాలు' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, 'జగమేమాయ' చిత్రంతో పరిశ్రమ గుర్తింపును పొంది ప్రస్తుతం పలు చిత్రాలలో నటిస్తూన్న వర్ధమాన తార. ఈ వర్ధమాన తార ఆశలూ, కాంక్షలు ఎలా వుంటాయో తెలుసుకోడానికి చలనచిత్ర ప్రతినిధి ఆమెను ఈ క్రింది ప్రశ్నలు వేశారు. దానికి ఆమె యిచ్చిన సమాధానాలు పొందు పరుస్తున్నాము.

ప్ర: నటనా జీవితానికి, నిజ జీవితానికి తేడా మీరు కనిపెట్టగలిగారా?

జ: నటనా జీవితం కేవలం క్షణిక మాత్రం. ఆ కొద్దిసేపు ఒక పాత్రలో లీనమైపోతాం. తిరిగి యధాస్థితికి వచ్చేస్తాం. కానీ నిజజీవితంలో లీనమైపోయేందుకు వీలులేదు. కారణం అలా లీనమైపోతే మన గమ్యం ఏమిటో మనకు తెలుసుకోవటం కష్టం.

ప్ర: నిజజీవితంలో మీ కోరికలేమిటి?

జ: నటిగా నేను నటించినా, నిజ జీవితంలో ప్రశాంతంగా జీవించాలన్నది నాకున్న ఒకే ఒక కోరిక.

ప్ర: మీరు సినిమా జీవితానికి రాకముందు కనీసం ఎన్ని నాటకాల్లో నటించారు?

జ: నూరు నాటకాలు.

ప్ర: నూరు నాటకాల్లో మీరు సంపాదించిన అనుభవం ఏమిటి?

జ: నా పదకొండో ఏట స్కూల్లో వేసిన నాటకంతో నా నాటక జీవితం ప్రారంభమైంది. కానీ అది నాకు తెలియని నటనా జీవితం. ఏదో పిల్లలతో నేనూ రంగుపుసుకుని టీచరమ్మ చెప్పిన నాలుగు ముక్కలూ అప్పచెప్పాను. కానీ నాకు తెలిసిన నటనా జీవితం 1969లో "సమిధ" నాటికతో ప్రారంభమైంది. నూరు నాటకాల్లో భయంలేకుండా, నటనను ప్రతి మెట్టునూ జీర్ణించుకుంటూ నటించగలిగాను. కానీ ఇప్పటికీ ఇంకా ఏదో నటనలో నేర్చుకోవాల్సింది ఉందనే అనిపిస్తోంది.

ప్ర: మీకు నటి కావాలన్న కోర్కె ఎందుకు కలిగింది?

జ: నేను చదువు మానేసిన తర్వాత డాన్స్ నేర్చుకుంటున్న రోజుల్లో నాగభూషణం గారి 'రక్త కన్నీరు' నాటకం చూడటం, మా నాన్నగారు ఆయనకు నన్ను చూపించి నన్ను నటిని చేయాలన్న ఆశయంతో సలహాలడిగారు. అప్పటికి నాకు నాటకానుభవంలేదు. కాబట్టి బాగా నాటకానుభవం సంపాదించి సినిమాల్లో నటిస్తే బాగుంటుందన్నారు. ఆయన మాట తూ.చ తప్పకుండా పాటించడంతో నా నట జీవితం ప్రారంభమైంది.

ప్ర: మీ సినిమా జీవితం ఏ చిత్రంతో ప్రారంభమైంది?

జ: నందినీ ఫిలింస్ 'ఇల్లు – ఇల్లాలు'

ప్ర: ఇల్లు – ఇల్లాలు ' తర్వాత మిమ్మల్ని నిర్మాత దర్శకులు గుర్తించారా?

జ: పెద్దగా గుర్తింపు రాకపోయినా ఒక కొత్త ఆర్టిస్టుగా నన్ను నేను పరిచయం చేసుకోగలిగే అవకాశం దొరికింది, ఆ తర్వాత 'జగమేమాయ'లో మంచి అవకాశం లభించింది. అప్పుడే 'కన్నె వయసు', 'మాణిక్య తొట్టిల్' అనే తమిళ చిత్రంలో కూడా అవకాశం దొరికింది.

ప్ర: ఇప్పటికి మీరు ఎన్ని చిత్రాల్లో నటించారు? నటించిన వాటిల్లో మీకు ఇష్టమైన పాత్ర ఏ చిత్రంలో నటించగలిగారు?

జ: విడుదలైన చిత్రాలు 'ఇల్లు – ఇల్లాలు', 'జగమే మాయ ', 'కన్నెవయసు ', 'మాణిక్య తొట్టిల్ ', 'ఆడంబరాలు – అనుబంధాలు', 'భూమికోసం '.

విడుదల కావల్సివున్నవి. 'దీక్ష', అమ్మ మనసు', 'భాగస్తులు', 'ఇల్లు – వాకిలి', 'హనీమూన్' (మళయాళం) దాదాపు అన్ని క్యారెక్టర్స్ మంచివే లభించాయి నాకు.

ప్ర: ప్రత్యేకంగా మీరేదయినా క్యారెక్టర్ వెయ్యాలని వుందా?

జ: ప్రత్యేకంగా ఫలానా క్యారెక్టర్ వెయ్యాలని నేనెప్పుడూ నిర్ణయించుకోలేదు. నటిగా ఏ పాత్రనైనా సమర్థతతో నటించగలన్న ధైర్యం నాలో వుంది.

ప్ర: అంటే మీరు నటనలో బాగా పండిపోయారనేగా అర్థం?

జ: నేను నేర్చుకోవాల్సిది చాలా వుంది. అందువల్ల నటనలో శిఖరాగ్రాన్ని చేరుకోలేకపోయినా, నటించగలనన్న ధైర్యం నాలో జీర్ణించుకున్నాను కాబట్టి ఏ పాత్రనైనా నటించగలనన్న ధైర్యం నాలో వుంది.

ప్ర: నాటక జీవితానికీ సినిమా జీవితానికీ చాలా తేడావుంది కదా, సెట్‌లో మీరే విషయంలోనైనా తికమకపడ్డారా?

జ: నాటకంలో నిజ జీవితంలా కథ సాఫీగా జరిగిపోతుంటుంది. అందువల్ల నాటకాల్లో నటించి అలవాటుపడ్డ నేను ముందు వెనుకలూ తోచని జీవితంలో నిర్మించే చివరి ఘట్టాలు, ముందుముందు సంఘటనలు వెనకా చిత్రీకరించే సమయాల్లో సరిగ్గా అర్థం చేసుకుని నటించటంలో వుండే కష్టం ఎంతో ఓర్పుతో కూడుకుని వున్నదన్న విషయం తెలిసేంతవరకు సినిమా జీవితంలో తొలుత తొలుత కొంచెం తికమకపడ్డాను. ఆ తర్వాత నేను అలవాటు పడిపోయాను.

ప్ర: మీరు హింది చిత్రాలు చూస్తారా? మీకు ఏ హిందీ నటంటే, ఇష్టం?

జ: నాకు హింది రాదు. కానీ అందరు బాగా వుందనే చిత్రాన్ని చూస్తాను. ప్రజలు మెచ్చిన నటి, నటులలో మేటి నటి, అటు పాతకూ కొత్తకు వారధిలాంటి నటీమణి కీ.శే.మీనాకుమారి అంటే నాకు ఎంతో ఇష్టం.

ప్ర: మీకు ఎన్ని చిత్రాల్లో నటించాలని వుంది?

జ: దర్శక నిర్మాతల గ్రహింపు, ప్రేక్షకుల ఆదరణ తరగని ధనంలా నావైపు వున్నంతవరకు నటిస్తూనే వుంటాను. చిత్రాల సంఖ్య ఎంతైనా కావచ్చు.

ప్ర: ప్రేక్షకుల గురించి మీ అభిప్రాయమేమిటి?

జ: చిత్రం యొక్క జయాపజయాలకు సరైన న్యాయనిర్ణేతలు ప్రేక్షకులు. నాటకాల్లో జడ్జెస్‌లాగ. నాటకానికి ముగ్గురే వుంటారు.కానీ ప్రతి తెలుగు చిత్రానికి ముక్కోటి ఆంధ్రులుంటారు.

ప్ర: మీ నటనను పొగుడుతూ కానీ, ఖండిస్తూగానీ ప్రేక్షకుల ఉత్తరాలు ఎప్పుడైనా అందుకున్నారా?

జ: 'జగమేమాయ' విడుదలైన సందర్భంలో నా నటనను గురించి మంచి అభిప్రాయంతో ఉత్తరాలొచ్చాయి. 'ఆడంబరాలు – అనుబంధాలు' విడుదలైన సందర్భంలో నేను నటించిన పాత్రను గురించి మంచి అభిప్రాయం లభించింది.

ప్ర: మీరూ ప్రేక్షకుల్లో ఒకరుగా మీరు నటించిన చిత్రాన్ని చూస్తున్నప్పుడు కొంతమంది పొగుడుతూ వుంటారు. మరి కొందరు మిమ్మల్ని చీదరించుకుంటున్న సమయంలో మీ మనసెలా వుంటుంది?

జ: పొగుడుతున్న సమయంలో పొంగిపోయి, ఖండిస్తున్నపుడు దిగులు పడిపోకూడదు ఏ ఆర్టిస్టయినా. ఎందుకు ఖండిస్తున్నారో ఆ లోపాన్ని గ్రహించి మరెప్పుడూ ఆ లోపాలు రాకుండా జాగ్రత్తపడతాను.

ప్ర: మీ నూరో చిత్రం విడుదలవుతున్నపుడు మీరేమనుకుంటారు?

జ: తొలి చిత్రంలో ఎంత భయం వుంటుందో నూరో చిత్రంలో కుడా అంత భయమే వుంటుంది .తొంభై తొమ్మిది చిత్రాల్లో పెంచుకొచ్చిన అంతస్థు ఒక్కసారిగా కూలిపోతుందన్న భయం.

ప్ర: మీ వయస్సెంత? మీ సినిమా వయస్సెంత?

జ: నా వయస్సు ఇరవై. సినిమా వయస్సు రెండున్నర.

చలనచిత్ర ప్రతినిధి.

Post your comments